నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I హైదరాబాద్, మంగళవారం 9 ఏప్రిల్ 2024 | YADADRI BHUVANAGIRI


## గుట్ట ప్రధానాలయంలోకి సెల్‌ఫోన్ల అనుమతి నిరాకరణ



యాదగిరిగుట్ట, ఏప్రిల్8 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయంలోకి సెల్‌ఫోన్లపై ఆంక్షలు విధిస్తూ ఈఓ భాస్కర్ రావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ప్రతినిధులతో పాటు ఆలయ ఎస్పీఎఫ్, మినిస్టీరియల్, నాలుగో తరగతి అధికారులు, హోంగార్డ్స్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఆలయ విధులు నిర్వహిస్తున్న సమయంలో సెల్‌ఫోన్‌లు తీసుకొని ఆలయంలోకి వెళ్లకూడదని తెలిపారు. దేవస్థానం ఆలయ అధికారులకు ప్రత్యేకంగా వాకీటాకీ అందుబాటులో ఉంచామని, వాటి ద్వారానే ఆలయానికి సంబంధించిన సమాచారం, ఇతర కార్యకలాపాలను కొనసాగించాలని చెప్పారు. స్వామి వారి ప్రధానాలయంలో వెళ్లే ఎవ్వరికీ మినహాయింపు లేదన్నారు. ఇప్పటికే ఆలయంలోకి భక్తులకు సెల్‌ఫోన్‌ల అనుమతి లేని విషయం తెలిసిందే.

# నేడు ఉగాది

- శ్రీక్రోధి నామ సంవత్సరానికి స్వాగతం
- పండుగకు ఏర్పాట్లు చేసుకున్న ప్రజలు
- జిల్లా ప్రజలకు మండలి చైర్మన్ గుత్తా, మంత్రి కోమటిరెడ్డి, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి శుభాకాంక్షలు



రామగిరి, ఏప్రిల్ 8 : ప్రకృతికి రంగులద్దినట్టు అప్పుడే వచ్చిన మావి చిగుళ్లు, కుహూ.. కుహూ.. అంటూ సరాగాలు పలుకుతూ కోకిలలు, సువాసనలు వెదజల్లే పూలు, నక్షత్ర గమనానికి ఆది అయిన తెలుగు నూతన సంవత్సరం వచ్చేంది. నేడు శ్రీక్రోధి నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రజలు ఉగాది పర్వదినాన్ని జరుపుకొనేందుకు సిద్ధమయ్యారు. ఇంటిల్లిపాది షడ్రుచుల ఉగాది పచ్చడిని ఆస్వాదించనున్నారు. ఆలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పండుగ సందర్భంగా సోమవారం మార్కెట్‌లో పచ్చడి కుండలు, మామిడి కాయలు తదితర సామగ్రి కొనుగోళ్ల సందడి కనిపించింది. ఉమ్మడి జిల్లా ప్రజలకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. క్రోధి నామ సంవత్సరంలో సమృద్ధిగా వానలు కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.



నల్లగొండలో ఉగాది పచ్చడి కోసం కుండలు కొనుగోలు చేస్తున్న మహిళలు

# పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బొంద పెట్టాలి

- వంద రోజులు దాటినా అమలు కాని హామీలు
- ఎండిన పంటలకు నష్టపరిహారం అందించాలి
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి



ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, చిత్రంలో జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, ప్రభాకర్‌రెడ్డి, భిక్షమయ్యగౌడ్, పార్టీ నేతలు కంచర్ల రామకృష్ణారెడ్డి, పల్లె రవికుమార్

చౌటుప్పల్/చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 8 : 'అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మోసపు మాటలు నమ్మి ప్రజలు ఓట్లు వేస్తే.. వంద రోజుల్లోనే పాత పరిస్థితులు తిరగబడ్డాయి. ఎక్కడ చూసినా కరువు తాండవిస్తున్నది. తాగునీటికి కటకట ఏర్పడింది. లక్షల ఎకరాలు ఎండిపోయాయి. అన్నదాతలు ఆత్మహత్య చేసుకుంటున్నారు. వీటన్నింటికీ కారణమైన కాంగ్రెస్ పార్టీని పార్లమెంటు ఎన్నికల్లో బొంద పెట్టాలి' అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని దామెర గ్రామంలో సోమవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటినా ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. రైతులకు రుణమాఫీ, అందరికీ రైతుబంధు, మహిళలకు నెలకు రూ.2,500 ఎటు పోయాయని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపిస్తే ఏడాదికి లక్ష రూపాయలు ఇస్తామని మళ్లీ తుక్కుగూడ సభలో రాహుల్ ప్రకటించడం విడ్డూరంగా ఉన్నదని పేర్కొన్నారు. పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం సాగునీటిని అందించలేకపోతున్నదని, ఉన్న నీటిని వాడుకోలేని దద్దమ్మలు కాంగ్రెస్ నేతలు అని దుయ్యబట్టారు. జిల్లాలో పంటలు ఎండిపోతుంటే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి 15రోజుల నుంచి కనిపించడం లేదన్నారు. జిల్లాలో మంత్రులు రైస్ మిల్లర్ల వద్ద అక్రమ వసూళ్లు చేసి ఢిల్లీలో కప్పం కడుతూ పదవులు కాపాడుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ధాన్యం ధర పడిపోయిందని రైతులు బాధపడుతున్నారని తెలిపారు. ఎండిన పంటలకు తక్షణమే రూ.25వేల నష్టపరిహారం ఇవ్వాలని, అన్ని పంటలకు క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. తక్షణమే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలన్నారు. వీటన్నింటిపై గ్రామాల్లో కార్యకర్తలు చర్చ పెట్టాలని, రైతులకు, మహిళలకు కాంగ్రెస్ మోసపు హామీలను విడమరిచి చెప్పాలని సూచించారు. పార్లమెంటులో తెలంగాణ గళం వినిపించాలంటే బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు విశేష కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### భారీగా తరలివచ్చిన గులాబీ శ్రేణులు

బీఆర్‌ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సమావేశం ఏర్పాటు చేసిన ఫంక్షన్‌హాల్ నిండిపోవడంతో కార్యకర్తలు చాలా మంది బయటే ఉండిపోయారు. నాయకుల ప్రసంగాలు శ్రేణుల్లో నూతన ఉత్తేజాన్ని నింపాయి.



సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు

## మూడు నెలల్లోనే పదేండ్ల వెనక్కి..

- బీఆర్‌ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్



కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం మూడు నెలల్లోనే పదేండ్ల వెనుకకు వెళ్లిందని, ప్రజా ప్రయోజనాలను రాష్ట్ర ప్రభుత్వం గాలికొదిలేసిందని బీఆర్‌ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ అన్నారు. మండలంలోని దామెర గ్రామంలో సోమవారం జరిగిన పార్టీ మునుగోడు నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారెంటీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి అవి చేయలేకపోయారన్నారు. మరోసారి ప్రజలను మోసం చేయడానికి ప్రజల వద్దకు వస్తున్నారని పేర్కొన్నారు. ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని, కేసీఆర్ ప్రవేశపెట్టిన చేనేత పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలందరికీ రూ.2500, కల్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ అమలు చేశాకే ఓట్లు అడగాలని సవాల్ చేశారు. లేదంటే ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. రైతులను చెప్పుతో కొడుతానని మంత్రి అనడం కాంగ్రెస్ నాయకుల అహంకారానికి పరాకాష్ట అని, వారికి తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు కష్టాలను అనుభవిస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సాధించిన కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి వీధి రౌడీలా వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలే సీఎం రేవంత్‌రెడ్డి బట్టలు ఊడదీసి కొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని హెచ్చరించారు. పదేండ్ల పాలనలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన పనులేవో చెప్పాలన్నారు. గుడులు, మతం పేరు చెప్పి ఓట్లు దండుకోవడం తప్ప మోదీ ప్రభుత్వం చేసిందేమీ లేదని విమర్శించారు. మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి



ఈ ప్రాంత అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం. కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు నమ్మరు. భువనగిరి ఖిలాపై ఎగిరేది గులాబీ జెండే. ఇందుకోసం ప్రతి ఒక్కరం కష్టపడి పనిచేద్దాం. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయి. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదు. అదే బీఆర్‌ఎస్‌కు కలిసి వస్తుంది.

*– ఎలిమినేటి సందీప్‌రెడ్డి, జడ్పీ చైర్మన్*

### బలహీన వర్గాల అభ్యర్థి మల్లేశ్‌ను గెలిపించాలి



బీఆర్‌ఎస్ పార్టీ భువనగిరి పార్లమెంటు సీటును మూడు సార్లు బీసీలకు కేటాయించి బలహీన వర్గాలకు అండగా నిలిచింది. ఇప్పుడున్న బీజేపీ అభ్యర్థి ఈ నియోజకవర్గం నుంచి రెండు సార్లు బీఆర్‌ఎస్ తరపున పోటీ చేశారు. బీఆర్‌ఎస్ పాలనలోనే బలహీన వర్గాలకు న్యాయం జరిగింది. కాంగ్రెస్ పార్టీలో సామాజిక న్యాయం లేదు. బలహీన వర్గాల అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలి.

*– బడుగుల లింగయ్యాయాదవ్, బీఆర్‌ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు*

### గ్యారెంటీలను గాలికొదిలేశారు



కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను గాలికొదిలేసి రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నది. హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నది. బీఆర్‌ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతూ భయపెట్టి పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్నది. అలాంటి వాటికి గులాబీ కార్యకర్తలు భయపడరు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ విజయం ఖాయం.

*– కంచర్ల రామకృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు*

### బీఆర్‌ఎస్ పాలనలోనే తండాల అభివృద్ధి



బీఆర్‌ఎస్ పాలనలోనే తండాలు అభివృద్ధి చెందాయి. గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే గ్రామాల్లో తాగు, సాగునీటి సమస్యను తీసుకొచ్చింది. ప్రజలకు గత ఎన్నికల్లో చేసిన పొరపాటు తక్కువ కాలంలోనే అర్థమైంది. ఎంపీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి మల్లేశ్ అత్యధిక మెజారిటీతో గెలువబోతున్నారు.

*– రమావత్ రవీంద్రకుమార్, బీఆర్‌ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు*

### సంక్షేమ పథకాలు అటకెక్కాయి



బోగస్ హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమ పథకాలను అటకెక్కించింది. సంక్షేమ పథకాలు ఎత్తివేయడంతో ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. ధాన్యానికి రూ.500 బోనస్, మహిళలకు రూ.2500 ఇచ్చాకే కాంగ్రెస్ నాయకులు ప్రజలను ఓట్లు అడగాలి. మోసపూరిత వాగ్దానాలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలి. బలహీన వర్గాల అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలి.

*– కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, మునుగోడు మాజీ ఎమ్మెల్యే*

### బీఆర్‌ఎస్ పాలనకు, కాంగ్రెస్ పాలనకు స్పష్టమైన తేడా



బీఆర్‌ఎస్ పాలనకు, కాంగ్రెస్ పాలనకు తేడా ఏంటో ప్రజలకు స్పష్టంగా అర్థమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లో మాటలు కోటలు దాటాయి. కానీ.. చేతలు గడప దాటలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించి క్యామ మల్లేశ్ విజయానికి కృషి చేయాలి.

*– బూడిద భిక్షమయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యే*

### 70 ఏండ్లు అధికారంలో ఉండి ప్రజలకు విషం ఇచ్చారు



స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నల్లగొండ జిల్లా ప్రజలకు కనీసం మంచి నీళ్లు ఇవ్వలేదు. స్వరాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించింది. రైతులను చెప్పుతో కొడుతామన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఓటుతో తగిన బుద్ధి చెప్పాలి.

*– పల్లె రవికుమార్, కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్*

## తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అనితా రామచంద్రన్, చిత్రంలో కలెక్టర్ హనుమంతు జెండగే

- రెండు నెలల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కార్యదర్శి అనితా రామచంద్రన్

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 8 : జిల్లాలో తాగునీటికి ఇబ్బందులు ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా తాగు నీటి సరఫరా ప్రత్యేక అధికారి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కార్యదర్శి అనితా రామచంద్రన్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ఆమె గ్రామాలు, మున్సిపాలిటీల్లో తాగు నీటి సరఫరాపై మిషన్ భగీరథ, మున్సిపల్, ఇంజినీరింగ్, ఎంపీడీఓ అధికారులతో సమీక్షించి మాట్లాడారు. వేసవిలో ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రతి ఇంటికీ తాగునీరు ఇవ్వాలని, ఇంజినీరింగ్ అధికారులు, ఎంపీడీఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి తాగునీటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. రాబోయే రోజుల్లో ఎక్కడైనా తాగు నీటి సమస్య ఉత్పన్నమైతే తక్షణమే చక్కదిద్దేందుకు యాక్షన్ ప్లాన్‌తో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. తప్పనిసరిగా ప్రతినెలా 1, 11, 21 తేదీల్లో ట్యాంకులను శుభ్రం చేయాలని, ప్రతిరోజూ క్లోరినేషన్ చేపట్టాలని తెలిపారు. తాగునీటి అవసరాలకు ఎస్డీఎఫ్, డిపార్టుమెంట్, గ్రామ పంచాయతీ నిధులను వినియోగించుకోవాలని సూచించారు. అవసరమైన చోట ట్యాంకర్లను, ప్రైవేటు బోర్లను సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. వచ్చే రెండు నెలలు జాగ్రత్తగా ఉండాలని, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిరోజూ మానిటరింగ్ చేయాలని అన్నారు. అనంతరం జిల్లాలో జరుగుతున్న ఉపాధి హామీ పనులపై ఆమె సమీక్షించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పని కల్పించాలని, కూలీల శాతం పెరిగేలా చూడాలని, వేసవి దృష్ట్యా కూలీలకు అన్ని వసతులు కల్పించాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ హనుమంతు కె.జెండగే మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా యాక్షన్ ప్లాన్‌తో సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కె.గంగాధర్, జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి, మిషన్ భగీరథ సూపరింటెండింగ్ ఇంజినీరు కృష్ణయ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎంఏ కృష్ణన్, జిల్లా పంచాయతీ అధికారి సునంద, మిషన్ భగీరథ డివిజనల్ ఇంజినీర్ కరుణాకర్, మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీఓలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు, అధికారులు పాల్గొన్నారు.

## దివ్యాంగ ఓటర్లకూ హోమ్ ఓటింగ్ సదుపాయం

- సాక్షం యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి
- కలెక్టర్ దాసరి హరిచందన




మాట్లాడుతున్న కలెక్టర్ దాసరి హరిచందన

నల్లగొండ, ఏప్రిల్ 8 : 85 సంవత్సరాలు నిండిన వృద్ధులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం హోమ్ ఓటింగ్ విధానం కల్పించినట్లు గానే, పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయలేని దివ్యాంగులకు హోమ్ ఓటింగ్ సదుపాయాన్ని కల్పించిందని నల్లగొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన తెలిపారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు ఓటు హక్కు ప్రాధాన్యతపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. 45 శాతానికి మించి వైకల్యం ఉన్న దివ్యాంగులు పోలింగ్ కేంద్రానికి రాలేని పరిస్థితుల్లో హోమ్ ఓటింగ్ విధానానికి సాక్షం యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, అలాగే ఫారం 12–డిలో సైతం దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. జిల్లాలో ఉన్న దివ్యాంగ ఓటర్లు ఎన్నికల్లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ట్రాన్స్‌జెండర్లు ఓటు వేయడమే కాకుండా, ఓటింగ్‌పై అవగాహన కల్పించే విధంగా కృషి చేయాలని కోరారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వీల్ చైర్లు, ర్యాంపులను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్‌రెడ్డి, గిరిజన సంక్షేమ అధికారి రాజ్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ సక్కుబాయి, ట్రాన్స్‌జెండర్స్ నాయకురాలు నందిని తదితరులు పాల్గొన్నారు.

## వర్ష సూచనతో రైతుల ఆందోళన

- కల్మెరలో ప్రారంభం కాని ధాన్యం కొనుగోళ్లు

కట్టంగూర్, ఏప్రిల్ 8 : మండలంలోని కల్మెర గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 6న కొనుగోలు కేంద్రాన్ని సీఈఓ మల్లారెడ్డి తన సిబ్బందితో కలిసి ప్రారంభించారు. ప్రారంభం కాకముందే రైతులు ధాన్యాన్ని కేంద్రంలో తరలించి ఎండబెట్టుకున్నారు. కేంద్రానికి గోనె సంచులు కూడా తీసుకొచ్చి కొనుగోళ్లను చేపట్టకపోవడంతో రైతులు కేంద్రంలోనే రాత్రి పగలు పడిగాపులు గాస్తున్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా వర్షాలు వచ్చే సూచనలు ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నా అధికారులు మాత్రం తమకు ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కొనుగోలు ప్రక్రియను చేపట్టాలని రైతులు కొరుతున్నారు. ఇదే విషయాన్ని సీఈఓ మల్లారెడ్డిని సంప్రదించగా త్వరలో కొనుగోళ్లు ప్రారంభిస్తామని తెలిపారు.



కల్మెర పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు

## రూ.50వేలకు పైబడిన సామగ్రికి ఆధారాలు చూపాలి

- నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి



నీలగిరి, ఏప్రిల్ 8 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రూ.50వేలకు పైబడిన సామగ్రి కొనుగోలు చేసి తీసుకెళ్లాల్సి వస్తే సరైన ఆధారాలు తమ వెంట ఉంచుకోవాలని జిల్లా ఎస్పీ చందనాదీప్తి సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా ఓటర్లను ప్రభావితం చేసే నగదు, మద్యం, బంగారం, ఇతర వస్తువులు సరఫరా కాకుండా నిరంతరం నిఘా పెడుతూ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజలు శుభకార్యాలకు బంగారం, రూ.50 వేలకు మించి ఉన్న సామగ్రిని తీసుకెళ్లేటప్పుడు సరైన ఆధారాలు, సంబంధిత పత్రాలు వెంట ఉంచుకొని తనిఖీ అధికారులకు చూపించాలని సూచించారు. లేకుంటే సీజ్ చేస్తారని, ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 123, భారతీయ శిక్షా స్మృతి (IPC) సెక్షన్ 171బి/ 171ఇ మరియు ఇతర చట్టాల ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

### సోషల్ మీడియాతో మహిళలు జాగ్రత్తగా ఉండాలి

సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్ స్టాగ్రామ్ వినియోగంలో విద్యార్థినులు, మహిళలు జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్పీ చందనా దీప్తి సూచించారు. రోజురోజుకూ విచిత్రమైన, కొత్త కొత్త ప్రకటనలతో సైబర్ నేరగాళ్లు వస్తున్నందున మహిళల భద్రత, ఆకతాయిల వేధింపుల నుంచి రక్షణకు పోలీస్ శాఖ అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు. మహిళా భద్రత కోసం పోలీస్ శాఖ పటిష్టమైన నిఘా చేపడుతుందని, షీ టీమ్స్ ద్వారా విద్యార్థినులు, యువతులు, మహిళలకు అవగాహన కల్పిస్తూ నిరంతరం వారికి అందుబాటులో ఉంటుందని పేర్కొన్నా రు. సామాజిక మధ్యమాల్లో ఫొటోలు, వీడియోలను పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థి నులు, మహిళలకు సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు సామాజిక మాధ్యమా ల్లో మెసేజ్‌లు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తుంటారని, అలాంటి మెసేజ్‌లకు స్పందించకుండా ఉండాలని తెలిపారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- సూర్యాపేట కలెక్టర్ ఎస్.వెంకట్రావ్



ఇమాంపేటలో ఐకేపీ కేంద్రం వద్ద ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట రూరల్, ఏప్రిల్ 8 : ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని, వెంటవెంటనే ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని సూర్యాపేట కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అధికారులకు సూచించారు. సూర్యాపేట మండల పరిధిలోని ఇమాంపేటలో సోమవారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు 354.896 మెట్రిక్ టన్నుల ధాన్యం అంచనా ఉందని, ఇప్పటి వరకు 241.0 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చిందని తెలిపారు. రైతులు తాలు లేకుండా, ధాన్యం తేమ శాతం 17 మించకుండా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. ఐకేపీ కేంద్రాలకు వచ్చే రైతులకు అసౌకర్యం కలుగకుండా అన్ని వసతులు కల్పించాలని సూచించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 281 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం శుద్ధి యంత్రాలు, తేమశాతం మిషన్లు, టార్పాలిన్లు, గోనె సంచులు అందుబాటులో ఉంచాలని చెప్పారు. రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా వ్యవసాయ శాఖతోపాటు అనుబంధ శాఖలు అవగాహన కల్పించాలని తెలిపారు.